నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, సోమవారం 25 డిసెంబర్ 2023 | BHADRADRI KOTHAGUDEM

# క్రిస్మస్‌ను ఆనందంగా జరుపుకోవాలి

## భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు


క్రిస్మస్ కానుకలు అందిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం, డిసెంబర్ 24 : ప్రభువు ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. ఆదివారం ములకపాడులోని చర్చిలో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన క్రిస్మస్ ప్యాక్‌లు 190 మంది క్రైస్తవులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, ఆర్‌ఐలు ఆదినారాయణ, పూనెం లక్ష్మయ్య, సర్వేయర్ సున్నం నర్సయ్య, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి కణితి రాముడు, పాస్టర్ యోహాన్, క్రైస్తవులు పాల్గొన్నారు.

## బీటీపీఎస్, మెడికల్ కళాశాలల ప్రస్తావన..



విద్యుత్ రంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం గత సర్కార్‌పై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, నిజానికి తెలంగాణ వచ్చిన తర్వాతే విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించిందని కేటీఆర్ స్పష్టం చేశారు. విద్యుత్ ఉత్పత్తి రంగాలు పుంజుకున్నాయన్నారు. గతంలో 7 వేల పైచిలుకు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఉండగా కేసీఆర్ ప్రభుత్వం దానిని 12 వేల పైచిలుకు మెగావాట్లకు పెంచిందన్నారు. దీనిలో భాగంగా భద్రాద్రి జిల్లా పరిధిలోని మణుగూరు సమీపంలో 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) నిర్మించామని విద్యుత్ స్వేదపత్రంలో వివరించారు. కొత్తగూడెం, ఖమ్మంలో అందుబాటులోకి వచ్చిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలతో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందని, వైద్యులు కావాలనుకునే పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన యువతీ యువకుల కల నెరవేరుతుందని కేటీఆర్ అన్నారు. ముఖ్యంగా భద్రాద్రి జిల్లా వంటి ఏజెన్సీ జిల్లాకు వైద్య, నర్సింగ్ కళాశాలలు రావడాన్ని ప్రజలు హర్షించారన్నారు. ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన ఐటీ హబ్‌తో వందలాది మంది యువత ఉన్నతమైన కొలువులు సాధించారన్నారు.

# ఏసు జననం.. మహిమాన్వితం..

- విశ్వ వేడుకగా కరుణామయుడి జన్మదినం
- నేడు క్రిస్మస్ పర్వం
- ఉమ్మడి జిల్లాలో వేడుకలకు ముస్తాబైన చర్చిలు
- అర్ధరాత్రి నుంచే ప్రారంభమైన క్రిస్మస్ ఆరాధనలు



క్రీస్తు జన్మదినాన్ని సోమవారం ఉమ్మడి జిల్లా అంతటా క్రైస్తవులు అత్యంత భక్తి ప్రపత్తులతో ఆనందోత్సాహాలతో జరుపుకోనున్నారు. చర్చిలన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆదివారం రాత్రి పదకొండు గంటల నుంచే క్రిస్మస్ ఆరాధనలను నిర్వహిస్తారు. ప్రత్యేకమైన క్రీస్తు పాటలు పాడి, క్రీస్తు జన్మ వృత్తాంతానికి చెందిన సందేశాన్ని చాటుతారు. క్రైస్తవులంతా నూతన వస్త్రాలను కొనుగోలు చేసి గృహాలను రంగులు, విద్యుత్‌దీపాలతో అలంకరించుకున్నారు. ప్రేమ, త్యాగం, కరుణ విలువలను చాటిన ఏసు సందేశం ఈ రోజున వాడవాడలా మార్మోగనుంది.

### బహుమతుల శాంతాక్లాజ్..

మన దేశంలోని క్రిస్మస్ తాతనే పాశ్చాత్య దేశాల్లో శాంతాక్లాజ్‌గా పిలుస్తారు. క్రిస్మస్ తాత సంప్రదాయం మూడో శతాబ్దంలో ప్రాచుర్యంలోకి వచ్చింది. క్రిస్మస్‌కు ముందు రోజు రాత్రి క్రిస్మస్ తాత ఇంటింటికీ వెళ్లి బహుమతులను ఇంటి ముంగిట పెట్టి తలుపుకొట్టి వెళ్లి పోయేవాడని పాశ్చాత్య దేశాల్లో ప్రాచుర్యం ఉంది.

### గంటల ప్రత్యేకత..

గడియారాలు లేని రోజుల్లో చర్చిల్లో సమయానుసారంగా మోగించే గంటలే ఊరంతటికీ సమయమెంతో తెలిపేవి. ముఖ్యంగా చర్చిలో ప్రార్థనలు, ఆరాధనల వేళల్లో గంటలు మోగగానే అందరూ హాజరయ్యేవారు. ప్రభువు సన్నిధికి తాము వెళ్లే సమయాన్ని సూచిస్తున్నందున గంటకు ప్రత్యేకత ఏర్పడింది.

### క్రీస్తు జన్మదినాన్ని చాటిన కాన్‌స్టాంటిన్



రోమ్ సామ్రాజ్యానికి చెందిన తొలి క్రైస్తవ చక్రవర్తి అయిన కాన్‌స్టాంటిన్ క్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్‌గా ఆచరించడం ప్రారంభించారు. క్రీస్తు జన్మదినాన్ని క్రిస్మస్‌గా ఆచరిస్తున్నప్పటికీ ఈ సంప్రదాయం మాత్రం ఆయన పుట్టిన 356 ఏళ్ల తర్వాత ప్రారంభమైనట్లు చరిత్ర చెబుతోంది. ఆ తర్వాత పోప్ జూలియన్ డిసెంబర్ 25ను క్రీస్తు జన్మదినంగా అధికారికంగా ప్రకటించారు. కానీ క్రిస్మస్‌ను ప్రపంచం అంతటికీ పరిచయం చేసిన ఘనత మాత్రం బ్రిటన్‌కు చెందిన సెయింట్ ఆగస్టీన్‌కు దక్కుతుంది. ఈయన రోమన్ క్యాలెండర్ ఆచరించే పాశ్చాత్య దేశాలన్నింటికీ ఈ పండుగను పరిచయం చేశారు. భారతదేశంలో క్రైస్తవులు తొలి శతాబ్దం నుంచే ఉన్నప్పటికీ క్రిస్మస్ ఆచరణ మాత్రం బ్రిటీష్ మిషనరీల రాకతోనే ప్రాచుర్యంలోనికి వచ్చింది.

> 'రక్షకుండుదయించినాడట. దావీదు వంశమున ధన్యుడు జన్మించినాడట..' అంటూ ప్రత్యేక ప్రార్థనలు జరుపుకుంటారు క్రైస్తవులు. లోకరక్షకుడి జన్మదినం మహిమాన్వితమైనదని, పవిత్రమైనదని విశ్వాసం. క్రైస్తవుల పండుగల్లో క్రిస్మస్ పండుగ అతి ముఖ్యమైనది. క్రీస్తు జన్మదినాన్ని క్రైస్తవులు క్రిస్మస్‌గా జరుపుకుంటారు. క్రైస్ట్, మాస్ అనే పదాల కలయికే క్రిస్మస్. క్రైస్ట్ అంటే క్రీస్తు, మాస్ అంటే ఆరాధన.
> -సారపాక/కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 24

### సందడే సందడి..

క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవుల షాపింగ్‌ల సందడి ముగిసింది. వారం రోజుల ముందు నుంచే నగరంలో పండుగ సందడి నెలకొంది. క్రిస్మస్ వేడుకల కోసం కేక్‌లు, స్వీట్లు ఆర్డర్ ఇచ్చేందుకు స్వీటు షాపులు కిటకిటలాడాయి. క్రైస్తవుల ఇళ్లపైన నక్షత్రం ఆకారంలో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేశారు. అంతటా క్రిస్మస్ ట్రీలు, బెల్స్, బెలూన్లు, స్టార్లు, శాంతాక్లాజ్ స్టిక్కర్లు, పండుగ శుభాకాంక్షలు తెలిపే బోర్డులు, పశువుల పాకలతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

### అర్ధరాత్రి నుంచే ఆరాధనలు..

జిల్లాలో రోమ్ క్యాథలిక్ మిషన్ (ఆర్‌సీఎం)కు చెందిన పలు చర్చిల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ ఆరాధనలను ప్రారంభించారు. ఖమ్మం రూరల్ మండలం కరుణగిరి, నాయుడుపేట, ఖమ్మం నగరంలోని వైరారోడ్డు, శ్రీనివాసనగర్, మౌంట్‌ఫోర్టు, తల్లాడ, కల్లూరు, పాల్వంచ, కొత్తగూడెంలోని ఆర్‌సీఎం చర్చిల్లో, భద్రాచలంలోని సెయింట్ ఆన్స్ ఆర్‌సీఎం చర్చిల్లో రాత్రి 11 గంటల నుంచే క్రిస్మస్ ఆరాధనలు ప్రారంభించారు. ప్రొటెస్టేన్స్ చర్చిలైన సెయింట్ మేరిస్, సీఎస్‌ఐ చర్చి, ఎన్‌ఎస్‌పీ క్యాంపులోని హోలీ ట్రినిటీ చర్చి, ఇందిరానగర్‌లోని సీఎస్‌ఐ క్రైస్ట్ చర్చి, ఖానాపురం హవేలీలోని లివర్స్ చర్చి, కూసుమంచిలోని ఇమ్మాన్యుయేల్ చర్చి, కొత్తగూడెంలోని ఆంద్రూస్ చర్చి, భద్రాచలంలోని సీఎస్‌ఐ క్రైస్ట్ చర్చి, పాల్వంచ, ఇల్లెందు, వైరా, రుద్రంపూర్, రామవరం, సత్తుపల్లిలోని సీఎస్‌ఐ చర్చిల్లో సోమవారం ఉదయం నాలుగు గంటల నుంచి క్రిస్మస్ ఆరాధనలను నిర్వహించనున్నారు.

### పశువుల పాకలో ఏసు జననం..


నెలలు నిండిన కన్య మరియమ్మను ఏసోబు తన సొంత గ్రామమైన బేత్లెహేముకు తీసుకుని వెళ్తారు. కానీ వారికి ఆ గ్రామంలో ఎక్కడా చోటు లభించదు. చివరికి ఒక పశువుల పాకలో తలదాచుకోవడానికి చోటు లభిస్తుంది. అప్పటికే నొప్పులు పడుతున్న మరియమ్మ చిన్నారి ఏసుకు జన్మనిస్తుంది. ఆ బాల ఏసును పొత్తి గుడ్డల్లో చుట్టి పశువుల తొట్టిలో ఉంచుతారు. దేవుడు భూమిపై జన్మించాలనుకుంటే ఏ రాజు కోటలోనో, ధనవంతుల ఇళ్లల్లో జన్మించి ఉండవచ్చు. కానీ తాను సామాన్య మానవుల కోసం లోకానికి వచ్చాననే సందేశాన్ని ఇవ్వడానికి పశువుల పాకలో క్రీస్తు జన్మించాడని క్రైస్తవుల విశ్వాసం.

### ప్రముఖుల క్రిస్మస్ శుభాకాంక్షలు



ఖమ్మం/కొత్తగూడెం టౌన్, డిసెంబర్ 24: క్రిస్మస్ పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన క్రైస్తవులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే కందాళ, ఉభయ జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక ఆల శుభాకాంక్షలు తెలిపారు. సంతోషంగా పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రేమ, కరుణ, దయ, సహనం, క్షమాపణ గుణాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షించారు.


విద్యుత్ కాంతుల్లో కొత్తగూడెంలోని చర్చి


విద్యుత్ కాంతుల్లో ఖమ్మంలోని సీఎస్ఐ చర్చి




## 28 నుంచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ఇల్లెందు రూరల్, డిసెంబర్ 24 : సుదిమల్ల గిరిజన గురుకుల కళాశాలలో ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు వివిధ అంశాల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఖమ్మం రీజియన్ అధికారి రాజు, కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి తెలిపారు. మండలంలోని సుదిమల్ల గిరిజన గురుకుల కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి జోన్ నుంచి 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జోనల్ క్రీడలకు ఎంపిక చేస్తామని, అక్టోబర్‌లో నల్లగొండ జిల్లాలో నిర్వహించే క్రీడల్లో వారు పాల్గొంటారని ఆమె వివరించారు.




భద్రాద్రి కొత్తగూడెం మెడికల్ కళాశాల


సీతారామ ప్రాజెక్టు

# కరువు పీడను వదిలించేందుకే సీతారామ

- 'స్వేద పత్రం' విడుదల ప్రసంగంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ప్రసంగంలో సీతారామ ప్రాజెక్ట్‌కు వెచ్చించిన నిధుల ప్రస్తావన
- ఖమ్మం ఐటీ హబ్ ద్వారా యువతకు కొలువులు వచ్చాయని ప్రకటన
- రెండు మెడికల్ కాలేజీలను ప్రజలు హర్షించారని ఉద్ఘాటన


ఖమ్మంలోని ఐటీ హబ్

ఖమ్మం, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి జిల్లాకు కరువు పీడను వదిలించేందుకే గోదావరిపై సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ప్రారంభించామని, ప్రాజెక్టు ఉభయ జిల్లాల ప్రజలకు వరదాయిని అని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత కేసీఆర్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 'శ్వేతపత్రం'పై కౌంటర్‌గా ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో 'స్వేదపత్రం' విడుదల చేసి మాట్లాడారు. ప్రసంగంలో భాగంగా ఆయన తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి ఖర్చు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ ప్రసంగంలో ఉమ్మడి జిల్లాకు సంబంధించిన సీతారామ ప్రాజెక్ట్, ఖమ్మం ఐటీ హబ్, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ గురించి కూడా ప్రస్తావించారు. రెండు జిల్లాకేంద్రాల్లో అందుబాటులోకి తెచ్చిన వైద్యకళాశాలల ప్రాధాన్యతను వివరించారు. దీంతో స్వేదపత్రంపై ఉమ్మడి జిల్లా ప్రజలూ ఆసక్తి కనబరిచారు. సీతారామ ప్రాజెక్ట్ కోసం రూ.80 వేల కోట్లు ఖర్చుచేశామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ పూర్తయితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు.

### టీవీలకే పరిమితమైన జనం..



కేటీఆర్ స్వేదపత్రం విడుదల చేస్తున్న విషయాన్ని ప్రచార సాధనాల ద్వారా తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేతలు, నాయకులు, అభిమానులు, ఉమ్మడి జిల్లాలకు చెందిన రైతులు, సాధారణ ప్రజలూ ఉదయం 11 గంటల నుంచే టీవీలకు హత్తుకుపోయారు. కేటీఆర్ ప్రసంగ పాఠాన్ని ఆసక్తిగా గమనించారు. స్వేదపత్రంలో ఉభయ జిల్లాలకు సంబంధించిన అంశాలు ప్రస్తావించినప్పుడు వారు సంతృప్తి వ్యక్తం చేశారు. సాగునీటి రంగం, ప్రాజెక్టులు, రైతు సంక్షేమ పథకాల అమలుపై హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ రంగంపై ప్రసంగిస్తున్నప్పుడు వారు కరెంట్ కోతలు లేనిది ఒక్క బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనేనని వ్యాఖ్యానించడం గమనార్హం.

### 'సీతారామ'తో పెరగనున్న సాగు విస్తీర్ణం



సీతారామప్రాజెక్టు జిల్లా వరదాయిని. నాటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టు నిర్మాణానికి తీసుకున్న చొరవ అభినందనీయం. జిల్లా రైతులు ఎక్కువగా కృష్ణా జలాలపైనే ఆధారపడి వ్యవసాయం చేస్తారు. సాగర్ ఎడమ కాలువే సాగుకు ఆధారం. తలాపున గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ ఆ జలాలు ఇప్పటివరకు సాగుకు అందలేదు. ఇలాంటి సందర్భంలో గత ప్రభుత్వం గోదావరి జలాలను జిల్లాలో పారించేందుకు సీతారామ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ప్రాజెక్ట్ పూర్తి చేయిస్తే జిల్లాలో సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది.

**– నారపాటి రమేశ్, రైతు, ఏదులాపురం, ఖమ్మం రూరల్, ఖమ్మం జిల్లా**

### బీఆర్‌ఎస్‌తోనే 24 గంటల విద్యుత్



గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నిర్ణయంతో జిల్లావ్యాప్తంగా అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేసింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత లో వోల్టేజీ సమస్యను అధిగమించేందుకు కొత్త సబ్ స్టేషన్లను సైతం నిర్మించారు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరంలో విద్యుత్ లైన్ల మరమ్మతు, నూతన లైన్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత లేకుండా చర్యలు చేపట్టారు. రెండో ఫేజ్‌తో ఉన్న గిరిజన గ్రామాలకు మూడో ఫేజ్ లైన్ వేశారు. నాయీ బ్రాహ్మణులు, రజకులకు ఉచిత విద్యుత్ పథకాలను అందిందించారు.

**– సామినేని తిరుపతిరావు, రైతు, గుదిమళ్ల**

### కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టుపై దృష్టి సారించాలి..



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగు, వ్యవసాయరంగానికి ప్రాధాన్యమిచ్చింది. దీంతో జిల్లాలో గణనీయంగా సాగు విస్తీర్ణం పెరిగింది. రానున్న రోజుల్లో సాగు విస్తీర్ణం మరింత పెరగాలనే ఉద్దేశంతో సీఎంగా నాడు కేసీఆర్ సీతారామ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. ప్రాజెక్టు పనులు పూర్తయితే గోదావరి జలాలు, పాలేరు రిజర్వాయర్‌కు నీరు రానున్నది. తద్వారా పాలేరు ప్రాంతంలో సస్యశ్యామలం కానున్నది. రైతులకు ఇక సాగునీటి కొరత ఉండదు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సీతారామప్రాజెక్టుపై దృష్టి సారించి సత్వరం పూర్తి చేయాలని రైతుల తరపున కోరుతున్నాం.

**– అక్కినపల్లి వెంకన్న, రైతు సంఘం నేత, ఖమ్మం రూరల్, ఖమ్మం జిల్లా**

### నాటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి.



గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయి. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు రైతులను ఆదుకున్నాయి. చరిత్రలో ఎన్నడూ ఎక్కడా లేని విధంగా రైతుల కోసం సంక్షేమ పథకాలు అమలయ్యాయి. రైతుబంధు పథకంతో రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే బాధ తప్పింది. రైతుబీమాతో రైతు మృతిచెందిన కుటుంబాలకు పరిహారం అందింది. నూతన ప్రభుత్వమూ ఇలా రైతులకు మేలు చేసే పథకాలు అమలు చేస్తే బాగుంటుంది.

**– బాలూనాయక్, సర్పంచ్, తీర్థాల, ఖమ్మం రూరల్, ఖమ్మం జిల్లా**

# సొంతింటి కలను నిజం చేసేందుకే క్రెడాయ్ ప్రాపర్టీ షో

## క్రెడాయ్ ఆల్ ఇండియా సెక్రటరీ జి.రామిరెడ్డి


ప్రాపర్టీ షోను ప్రారంభిస్తున్న ఆల్ అండియా క్రెడాయ్ సెక్రటరీ జీ రామిరెడ్డి

రఘునాథపాలెం, డిసెంబర్ 24: అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఖమ్మం జిల్లావాసుల సొంతింటి కలను సాకారం చేసేందుకే 'క్రెడాయ్' నగరంలో ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నదని క్రెడాయ్ ఆల్ ఇండియా సెక్రటరీ జీ రామిరెడ్డి అన్నారు. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఆదివారం ఆయన ప్రాపర్టీ షోను ప్రారంభించి మాట్లాడారు. ఇంత చక్కటి అవకాశాన్ని జిల్లావాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సంస్థ జిల్లా అధ్యక్షుడు బండి జయకిషోర్‌తో కలిసి స్టాళ్లను పరిశీలించారు.

**70కి పైగా స్టాళ్లు..**

ప్రాపర్టీ షోలో ఖమ్మంతో పాటు హైదరాబాద్‌కు చెందిన అనేక ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, హౌజింగ్, ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, అపార్టుమెంట్ ప్రాజెక్టులకు సంబంధించిన అనేక కంపెనీలు 70కిపైగా స్టాళ్లు ఏర్పాటు చేశాయి. అర్హులైన వినియోగదారులకు రుణ సదుపాయం కల్పించేందుకు బ్యాంకర్లూ స్టాళ్లు నిర్వహించారు. నిర్వాహకులు గంట గంటకూ డ్రా తీసి విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రాపర్టీ షోలో క్రెడాయ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్‌రెడ్డి, కోశాధికారి జగన్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది కేశవరావు, కోశాధికారి చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, ఇతర ప్రతినిధులు సురేశ్, కొప్పు నరేశ్, కృష్ణమోహన్, రంగారావు, వీరయ్య, శ్రీనివాస్, కిశోర్‌కుమార్, నగేశ్, ఉమేశ్, నారాయణరావు, సైదుబాబు, మురళి పాల్గొన్నారు. సోమవారం జరిగే ముగింపు సభకు రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.



హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలతో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు వీపీ గౌతమ్, డాక్టర్ ప్రియాంక ఆల, ఖమ్మం సీపీ విష్ణు ఎస్ వారియర్, భద్రాద్రి ఎస్పీ వినీత్.

